క్లుప్తంగా

ఆవాసానికి చేయూత



విరాళం ఇస్తున్న దాత రాములు

భైంసాటౌన్: పట్టణంలోని స్వామి వివేకానంద అనాథ పిల్లల ఆవాసానికి కుంటాల మండలం పెంచికల్‌పాడ్‌కు చెందిన అవదూత్‌వార్ రాములు విరాళం అందజేశారు. ఆదివారం ఆయన ఆవాసాన్ని సందర్శించారు. రూ.15 వేలతోపాటు, తాను నెల రోజులు టీ మానేసి పోగు చేసిన మరో రూ.3650 సైతం ఆవాసానికి అందజేశారు. దీంతో ఆవాసం నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆవాసం కమిటీ సభ్యులు సాదుల కృష్ణదాస్, శైలేశ్ మాశెట్టివార్, రంగు రవి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో సోమవారం నిర్వహించే సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో అన్ని గ్రామాల కార్యకర్తల వివరాలను సేకరించి పార్టీని బలోపేతం చేసే దిశగా కమిటీ ఏర్పాటు గురించి చర్చిస్తారని వివరించారు.

ఆత్మ డైరెక్టర్ల నియామకం



కిరణ్‌సింగ్



సమ్మెట రవి

లక్ష్మణచాంద: జిల్లా ఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) డైరెక్టర్లుగా ఇద్దరు నియమితులయ్యారు. మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన ఠాకూర్ కిరణ్‌సింగ్, లక్ష్మణచాందకు చెందిన సమ్మెట రవి ఆత్మ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఆత్మ డైరెక్టర్లుగా నియమించిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అన్యాయం చేయొద్దు



ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మామడ: కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు నాలుగు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారని.. రైతులకు అన్యాయం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కొరిటికల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని.. రైతులకు అన్యాయం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాపురెడ్డి, చిన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

స్వగ్రామానికి వెళ్తూ.. అనంతలోకాలకు



శివకుమార్(ఫైల్)

నిర్మల్‌రూరల్: నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి గ్రామానికి చెందిన సుంకే శివకుమార్(22) పని మీద స్కూటీపై ఆదివారం జిల్లాకేంద్రానికి వచ్చాడు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తూ రత్నాపూర్‌కాండ్లీ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. దీంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్‌కు తల్లి లక్ష్మి, తండ్రి భూమరాజు ఉన్నారు. తండ్రి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఖానాపూర్: పట్టణంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవస్థానం కోసం భూమి కొనేందుకు ఆదివారం ఖానాపూర్‌లోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన ఉషల్‌వార్ రమాదేవి-మహేశ్ దంపతులు రూ.5116ను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భీమేశ్వర్, జనార్దన్, అర్చకులు కీర్తి రాఘవ శర్మకు విరాళం అందజేశారు.



చెట్టు నీడన హాయిగా..

కుంటాల: ప్రస్తుతం భానుడి ప్రతాపానికి మనుషులతోపాటు మూగజీవాలు అల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల నుంచి మూగజీవాలను కాపాడేందుకు మండలంలోని అందాకూర్ శివారులో ఊడలమర్రి చెట్టు కింద ఆదివారం మధ్యాహ్నం మందను కాపర్లు ఉంచారు. పశువులు చెట్టు నీడ కింద సేదతీరుతున్న దృశ్యమిది.



రోడ్లపై ప్రమాదకరంగా..

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రోడ్లపై తిరుగుతున్న పశువులతో వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై పశువులు తిరగకుండా యజమానులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.



'కర్ర'ంటు స్తంభం డేంజర్..

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో మసీద్ ఎదుట విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తీగలు వేలాడుతూ ఉండటంతో మధ్యలో కర్రను స్తంభంగా ఏర్పాటు చేశారు. ఈదురుగాలులకు ప్రమాదం జరగకముందే తీగలను సరిచేసి సిమెంట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

వనమహోత్సవానికి సన్నద్ధం

- నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు
- గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



కుంటాలలో మొక్కలకు రక్షణగా వేసిన పందిరి



దౌనెల్లి నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

కుంటాల: పర్యావరణ పరిరక్షణకు అడవుల విస్తీర్ణం పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వన మహోత్సవానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. వర్షాలు కురువగానే మొక్కలు నాటేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఏయే మొక్కలు ఎక్కడ నాటాలో అధికారులు.. క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు.

మండలంలో లక్షా ఎనభై వేల మొక్కలు..

గ్రామాలు పచ్చదనంతో కళకళలాడేలా అధికారులు మొక్కలు నాటించేందుకు సమాయత్తమవుతున్నారు. కుంటాల మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ఇందులో లక్షా 80 వేల మొక్కలను పెంచుతున్నారు. అంబుగామ గ్రామపంచాయతీలో 8వేలు, అంబకంటిలో14వేలు, అంబకంటితండాలో8వేలు, అందాకూర్‌లో12వేలు, దౌనెల్లిలో 12వేలు, కుంటాలలో17వేలు, లింబా(కె)లో14వేలు, లింబా(బి)లో 15వేలు, మెదన్‌పూర్‌లో12వేలు, పెంచికల్‌పాడ్‌లో11వేలు, ఓలాలో15వేలు, సూర్యాపూర్‌లో12వేలు, వెంకూర్‌లో8వేలు, విఠాపూర్‌లో 12 వేల మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పెంచుతున్న మొక్కల వివరాలు..

గతంలో కంటే ఈసారి ఎక్కువగా పండ్ల మొక్కలు, ఆరోగ్యానికి మేలు చేసే కరివేపాకు, మునగ మొక్కలను ప్రజలకు అందించనున్నారు. నర్సరీల్లో సీతాఫలం, జామ, నిమ్మ, దానిమ్మ, ఈత, బొప్పాయి, ఖర్జూరా, రేలా, నేరేడు, అల్లనేరేడు, అశ్వగంధ, అంజీర, కరివేపాకు, మునగ, వేప, గానుగ, టేకు, గుల్మోర్, సెల్‌ట్రో ఫాం, నీలగిరి, మల్లె, మందారం, గన్నేరు, కాగితం(బోగన్ విలియం) తదితర మొక్కలను పెంచుతున్నారు.

చలువ పందిళ్ల ఏర్పాటు..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన 15 నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు వాడిపోకుండా నర్సరీల్లో ప్రత్యేకంగా గ్రీన్‌మ్యాట్ (చలువ పందిళ్లు) ఏర్పాటు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు మూడు పూటలా నీళ్లు పట్టిస్తున్నారు. జూన్ మాసంలో వర్షాలు కురిస్తే మొక్కలు నాటేందుకు అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. మరోవైపు ఇదివరకు నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

నీళ్లు అందిస్తున్నాం



మా గ్రామ నర్సరీలో నీడనిచ్చేవాటితోపాటు, పూలు, పండ్ల మొక్కలతోపాటు మునగ, కరివేపాకు మొక్కలను పెంచుతున్నాం. అవి ఎండిపోకుండా మూడు పూటలా నీళ్లు పట్టిస్తున్నాం.

– సోహిందర్, పంచాయతీ కార్యదర్శి, దౌనెల్లి

మొక్కలు నాటేలా చర్యలు



వన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. నర్సరీల్లో అన్ని మొక్కలను పెంచుతున్నాం. అవి వాడిపోకుండా గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేయించాం. జూన్‌లో వర్షాలు కురవగానే మొక్కలు నాటడం ప్రారంభిస్తాం.

– గట్టుపల్లి నవీన్, ఏపీవో, కుంటాల

బీజేపీ మండల కమిటీలు ఎన్నిక

తానూరు: బీజేపీ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సమక్షంలో నిర్మల్‌లో ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కమిటీ ఉపాధ్యక్షులుగా బాలాజీ యాదవ్, నాగుల సాయి, సాయినాథ్ పటేల్, అబాజీ పటేల్, ప్రధాన కార్యదర్శులుగా బి.నర్సింలు, బి.మారుతి, కార్యదర్శులుగా పి.పండరి, డి.నాగేశ్, అక్షయ్ పటేల్, దర్శన్, కోశాధికారిగా కె.నాగేందర్‌తో పాటు 35 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

కుంటాల: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదేశాలను సారం బీజేపీ కుంటాల మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పసుల నవీన్ ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా రవి,సుధాకర్, షేక్ గౌస్, రాథోడ్ మోహన్, ప్రధాన కార్యదర్శులుగా సూర్యవంశీ సాయినాథ్, బోగ గోవర్ధన్, కార్యదర్శులుగా ఎర్రోజు ప్రశాంత్, పడకంటి సాయినాథ్, జాదవ్ అఖిల్ పటేల్, దర్శనం పోశెట్టి, ట్రెజరరీగా సూదం మహేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



బాసరలో ఎన్నికైన మండల కార్యవర్గం

బాసర: మండలకేంద్రంలో ఆదివారం బీజేపీ బాసర మండల కార్యవర్గాన్ని కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గణేశ్‌పటేల్, నరేశ్‌రెడ్డి, అనిల్‌కుమార్, సాహెబ్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా హౌగీరావు, వినాయకరావు, కార్యదర్శులుగా శీను యాదవ్, సందుల రవి, మమ్మాయి గంగాధర్, బి.కల్పన, కోశాధికారిగా రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండలాధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పేర్కొన్నారు.

'ముథోల్ ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు'

భైంసాటౌన్: బీఆర్ఎస్ నాయకులు రాజకీయ అవగాహన లేకుండా ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌పై విమర్శలు చేస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ టూరిస్ట్‌లా వారానికోసారి నియోజకవర్గానికి వచ్చి.. నిరంతరం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే ఊరుకోబోమన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని సూచించారు. పట్టణాధ్యక్షుడు రావుల రాము, మండలాధ్యక్షురాలు సుష్మ, సోలంకి భీంరావ్, పండిత్‌రావు, రావుల పోశెట్టి, సాహెబ్‌రావ్, సాయినాథ్, తదితరులున్నారు.

నేటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

కుంటాల: భూభారతి చట్టం అమలు కోసం ప్రభుత్వం కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈనెల 5 నుంచి16 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించి 587 మంది రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ కమల్ సింగ్ వెల్లడించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సోమవారం లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మకు పూజలు



పూజలు చేస్తున్న వీడీసీ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో నల్లపోచమ్మ ఆలయం వద్ద పూజలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వీడీసీ సభ్యులు ఈర్ల ముత్యం, చిన్నయ్య, రమేశ్, నరేశ్, భీమేశ్, రాజశేఖర్, ప్రశాంత్, గంగన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి..



చించోలి(బి)లో సమావేశమైన 2009-10 బ్యాచ్ విద్యార్థులు



భైంసాలో 2005-06 బ్యాచ్ విద్యార్థులు

సారంగపూర్/భైంసాటౌన్ : మండలంలోని చించోలి(బి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తాము చదివిన పాఠశాలలోనే అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. భైంసాలోని జేఆర్ఎం పాఠశాలలో 2005-06లో పదోతరగతి చదివిన విద్యార్థులు స్థానిక డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడిగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుండలిక్‌రావు పాటిల్, హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మేసిన కోనోకార్పస్



బాసర: చదువుల తల్లి కొలువైన బాసరలో శివాజీచౌక్ వద్ద ఉన్న ప్రధాన ద్వారం ఎదుట కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరగడంతో అమ్మవారి విగ్రహం కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో డివైడర్ మధ్యలో కోనోకార్పస్ మొక్కలను నాటగా ప్రస్తుతం చెట్లుగా మారాయి. ఇవి మానవాళి ఆరోగ్యానికి హాని చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఆలయ ముఖద్వారం కన్పించేలా చెట్లను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.





రోడ్లపై ధాన్యం..



చామన్‌పెల్లి సమీపంలో రోడ్డుపై రాళ్లు ఉంచిన రైతులు

- చింతల్‌చాందకు ఆర్టీసీ బస్సు నిలిపివేత

లక్ష్మణచాంద: మండలంలో ప్రధాన రహదారులపై రైతులు వరి ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ధాన్యం కుప్పల కారణంగా చింతల్‌చంద, పొట్టపెల్లి, లక్ష్మణచాంద, చామన్‌పెల్లి గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. 15 రోజులుగా బస్సు రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆటోలపై ఆధారపడుతున్నారు. రోడ్లపై ధాన్యం, టార్పాలిన్లు, రాళ్లు ఉంచడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల దిలావర్‌పూర్ మండలంలో ఓ వ్యక్తి రాత్రి ధాన్యం పక్కన రాళ్లపై ద్విచక్ర వాహనం ఎక్కడంతో కిందపడి గాయపడ్డాడు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పంట కల్లాల నిర్మాణానికి రూ.80 వేల వరకు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. ఆర్అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతులు పంట కల్లాల్లో ధాన్యం ఆరబెట్టేలా చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతలు సహకరిస్తే బస్సు పునరుద్ధరణ..

మండలంలోని లక్ష్మణచాంద నుంచి చింతల్‌చాంద వరకు ప్రధాన రోడ్డుపై సగం కన్నా ఎక్కువగా రైతులు వరి ధాన్యం పోశారు. రాళ్లు అడ్డు పెడుతున్నారు. దీంతో బస్సు వెళ్లే సమయంలో ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందిగా ఉంటుంది. దీనికి తోడు లోడింగ్ సమయంలో లారీలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. రోడ్డుపై ధాన్యం తొలగిస్తే బస్సు పునరుద్ధరిస్తాం. – పండిరి, డీఎం, నిర్మల్



చామన్‌పెల్లి సమీపంలో రోడ్డుపైనే ధాన్యం సంచులు

పండ్లు పంపిణీ

కడెం: కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కడెం ప్రభుత్వాసుపత్రిలో నేతలు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, బబ్లూ ఉన్నారు.